నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, మంగళవారం 13 మే 2025 | YADADRI BHUVANAGIRI

విజయవిహార్‌లో సెల్ఫీ దిగుతున్న ఇండియా తరపున పోటీలో పాల్గొంటున్న నందిని గుప్తా

విజయవిహార్‌లో ఫొటో షూట్‌లో పాల్గొన్న వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు

బుద్ధవనం ఎదుట ఫొటో దిగిన మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందాల భామలు

సాగర్ చెంత అందాల భామల పులకింత

- విజయవిహార్, బుద్ధవనం సందర్శించిన మిస్ వరల్డ్ ఓసియన్ గ్రూప్ సుందరీమణులు
- 22 దేశాలకు చెందిన భామలకు ఘన స్వాగతం
- ఫొటో షూట్.. సాంస్కృతిక కార్యక్రమాలతో కాలక్షేపం

బుద్ధ మందిరంలో ధ్యానం చేస్తున్న సుందరీమణులు

నందికొండ, మే 12 : మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనే ఓసియన్ గ్రూప్ -4లోని 22 దేశాలకు చెందిన అందాలభామలు బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం బుద్ధవనాన్ని సందర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాలకు చెందిన సుందరీమణులు హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటుండగా, అందులోని ఆసియా దేశాలు ఇండియా, బంగ్లాదేశ్, కాంబోడియా, మయన్మార్, వియత్నాం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేసియా, జపాన్, కజికిస్తాన్, కిర్గికిస్తాన్, లెబెనాన్, మంగోలియా, నేపాల్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, శ్రీలంక, టర్కీ, చైనా, థాయిలాండ్, ఆర్మేనియాకు చెందిన సుందరీమణులు బుద్ధవనానికి వచ్చారు. హైదరాబాద్ నుంచి బస్సులో రోడ్డు మార్గంలో మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరి సాయంత్రం 4.55 నిమిషాలకు నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్‌కు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్ వెళ్తూ వీరు చింతపల్లి మండల పరిధిలోని తీదేడు సమీపంలో గల వెల్లంకి గెస్ట్ హౌస్‌లో సుమారు గంట సేపు అగారు. వీరికి ఐజీ సత్యనారాయణ, ప్రత్యేకాధికారి లక్ష్మి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలతో స్వాగతం పలికారు. విజయవిహార్ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకొని విజయవిహార్ వెనుక భాగంలో కృష్ణానది అందాలతో ఫొటో షూట్ చేశారు. సుందరీమణులు సెల్ఫీలు తీసుకుంటూ అతిథి గృహం వద్ద సందడి చేశారు. అనంతరం విజయవిహార్ ముందుభాగంలో మీడియా పాయింట్‌లో ఏర్పాటు చేసిన స్టేజ్‌పై గ్రూప్ ఫొటో దిగారు. అక్కడి నుంచి 6.15 నిమిషాలకు బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు బుద్ధవనం చేరుకొని బుద్ధచరిత వనంలోని బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించారు. మహాస్థూపం ఎదుట గ్రూప్ ఫొటోలను దిగారు. మహాస్థూపం నుంచి ధ్యాన మందిరానికి పోయే మార్గంలో లంబాడి సాంస్కృతిక డ్యాన్స్‌లతో స్వాగతం పలుకగా 7.40 నిమిషాలకు మహాస్థూపంలోని ధ్యాన మందిరానికి చేరుకున్నారు. మహాస్థూపంపై ఏర్పాటు చేసిన బుద్ధుడి శిల్పాలను, బుద్ధుడి జననం నుంచి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలను బుద్ధవనం పూరావస్తు నిపుణులు ఈమని శివనాగిరెడ్డి వారికి వివరించారు. ధ్యాన మందిరంలో జ్యోతులు వెలిగించి ధ్యానంలో పాల్గొన్నారు. అనంతరం జాతక పార్కులో బుద్ధ చరితంపై కళాకారుల నృత్య ప్రదర్శను తిలకించి రాత్రి 8.20 నిమిషాలకు తిరిగి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, శంకర్‌నాయక్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఏఎస్పీ మౌనిక, ఆర్‌డీఓలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఘనపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ విఫలం

- కాంటాలు కాక నెలల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు
- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, మే 12 : నెలల తరబడి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో సర్కారు పూర్తిగా విఫలమైందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గుడిపల్లి మండలంలోని ఘనపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి జిల్లా సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని వదిలి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, అధికారుల అందాల పోటీల ఏర్పాట్లలో మునిగిపోయారని విమర్శించారు. నెల రోజుల క్రితం తీసుకొచ్చిన ధాన్యాన్ని మాశ్చర్ కూడా చూడటంలేదని, మిల్లర్లు తమ టార్గెట్ పూర్తయ్యిందని చేతులు ఎత్తి వేశారని అన్నారు. లారీలు అందుబాటులో లేకపోతే రైతుల ట్రాక్టర్లలో ధాన్యాన్ని మిల్లర్లు తరలించే అవకాశం కల్పించాలని, తేమ పేరుతో కోత విధిస్తే రైతులతో కలిసి ధర్నాలు చేపడుతామని చెప్పారు. మంత్రులు గాలి మోటార్లలో అధికారిక పర్యటనలు తప్ప రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా తన ధాన్యాన్ని ఎగుమతి అయ్యేలా చూడాలని రైతులు రవీంద్రకుమార్‌కు మొర పెట్టుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, నాయకులు మునగాల అంజిరెడ్డి, అర్వపల్లి నర్సింహ, సుధాకర్ గౌడ్, శ్రీను, మహేందర్, యాదగిరి, కృష్ణారెడ్డి, గోలి గిరి ఉన్నారు.

హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మతాన్ని హింసకు వాడుకోవడం ఆటవిక సంప్రదాయం

- ఉగ్రవాద నిర్మూలనకు శాశ్వత పరిష్కారం చూపాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హుజూర్‌నగర్, మే12 : మతాన్ని హింసకు వాడుకోవడం ఆటవిక సంప్రదాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. కశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్ర వాదులు అమాయకులను చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎప్పుడైనా ఆకస్మికంగా దాడులు చేసి వెళ్లిపోవడం చూశామని, మొదటిసారి మత ప్రాతిపదికన చంపడం జరిగిందని చెప్పారు. హుజూర్‌నగర్‌లో సోమవారం సీపీఐ సీనియర్ నాయకురాలు పశ్య కన్నమ్మ సంతాప సభకు హాజరై మాట్లాడారు. చరిత్రలో కన్నీరు ఎక్కడ వృథాగా పోలేదని, ఇప్పుడు కూడా ఉగ్రవాదాన్ని లేకుండా చేసేందుకు ఆ కన్నీరు కారణమవుతుందని చెప్పారు. దేశంలో ఎన్నికలు జరిగినప్పుడు టెర్రరిస్టులు దాడులు చేయడం, అమాయకులు బలి కావడంతో దానిని బీజేపీ ఎన్నికల్లో లబ్ధి చేకూరేలా మలుచుకోవడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. అమెరికా ఒక వైపు పాకిస్థాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగిస్తూనే టెర్రరిస్ట్ యాక్టివిటీని వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించడం విడ్డూరం ఉందని తెలిపారు. తీవ్రవాద సమస్యకు కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపడం బీజేపీ ప్రభుత్వానికి ఇష్టం లేనట్లుందని విమర్శించారు. మతాన్ని, టెర్రరిజాన్ని ఎన్నికల లబ్ధి కోసం ఉపయోగించుకోవడం ఏ మాత్రం తగదన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఆర్ఎస్ఎస్ రెండూ ఒకే సంవత్సరం ఆవిర్భవించినా దేశం కోసం పోరాడిన చరిత్ర, నిజమైన దేశభక్తి కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, అక్కినేని వనజ, మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి రజని పాల్గొన్నారు.

దిర్శించర్ల ఊర చెరువు శిఖం భూమిలో మట్టి పోసిన రైతులు

ఆక్రమణల చెరలో దిర్శించర్ల ఊర చెరువు

- 50 ఎకరాలు కబ్జా చేసిన 22 మంది రైతులు
- కోర్టును ఆశ్రయించిన మత్స్య సొసైటీ చైర్మన్
- ఇప్పటికీ భూమిని స్వాధీనం చేసుకోని అధికారులు

నేరేడుచర్ల, మే 12: చెరువులు, కుంటలు ఆనవాళ్లు కోల్పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఆక్రమణకు గురవుతున్న చెరువును కాపాడాలని ప్రజలే కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో సర్వే నంబర్ 52లోని ఊర చెరువును కొందరు దర్జాగా కబ్జా చేస్తున్నారు. చెరువును ఆనుకొని ఉన్న తమ పట్టా భూమిల్లో పంటలు సాగు చేసుకుంటున్న కొందరు రైతులు ఏకంగా చెరువు శిఖం భూమిని ఏటా కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటున్నా సంబంధిత అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులోని మట్టినే ఎత్తి శిఖం భూమిలో పోసి చదును చేస్తున్నారు. 52వ సర్వే నంబర్‌లో ఊర చెరువు మొత్తం 111.26 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు పునరుద్ధరణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద రూ.33 లక్షలు మంజూరు చేసింది. అయితే, కాంట్రాక్టర్లు ఆక్రమణకు గురైన చెరువు శిఖం భూముల జోలికి వెళ్లకుండానే మిగిలిన చెరువులోనే పూడికతీత చేపట్టారు. దీంతో చెరువు శిఖం పలువురి రైతుల కబ్జాలోనే ఉండిపోయింది. దీంతో చెరువు శిఖం భూమిని కాపాడాలని గ్రామానికి చెందిన పంగ నాగరాజు హైకోర్టును ఆశ్రయించారు.

50 ఎకరాల భూమి

ఇటీవల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కలిసి చెరువులో సర్వే చేయగా చాలా భూమి ఆక్రమణకు గురైనట్లు తేలింది. చెరువు చుట్టూ ఉన్న రైతులు శిఖం భూమిని ఆక్రమించుకున్నట్లు తేలింది. సుమారు 22 మంది రైతులు 50 ఎకరాల వరకు ఆక్రమించుకున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. కానీ ఇంత వరకు వారి నుంచి మాత్రం శిఖం భూమిని స్వాధీనం చేసుకోలేదు.

కోర్టును ఆశ్రయించిన చెరువు చైర్మన్

ఆక్రమణకు గురవుతున్న ఊర చెరువును కాపాడాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన ఊర చెరువు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ పంగ నాగరాజు గత జనవరిలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీంతో స్పందించిన న్యాయస్థానం ఆక్రమణలు నిజమా.. కాదా అనే విషయంపై తుది నివేదికను ఫిబ్రవరి 22వ తేదీలోపు కోర్టుకు అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. దీంతో స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి మొత్తం 22 మంది రైతు లు సుమారు 50 ఎకరాలు ఆక్రమించుకున్నట్లు నివేదిక తయారు చేసి వారికి నోటీసులు జారీ చేశారు. కానీ ఇంత వరకు ఆక్రమించుకున్న భూమిని మాత్రం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోలేకపోయా రు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణకు గురైన చెరువు శిఖం భూమి ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

త్వరలోనే స్వాధీనం చేసుకుంటాం

ఊర చెరువు ఆక్రమణ మా దృష్టికి వచ్చింది. చెరువు శిఖం భూమిని ఆక్రమించుకున్న వారికి నోటీసులు జారీ చేశాం. త్వరలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటాం.

- సురిగి సైదులు, తాసీల్దార్

అవినీతిలో అంతా భాగస్వాములేనా?

సూర్యాపేట జిల్లాలో పరువుతీస్తున్న పలు శాఖలు

- వైద్యారోగ్యశాఖ నుంచి పోలీసు శాఖ వరకు..
- విచ్చలవిడిగా ఫేక్ డాక్టర్లు, స్కానింగ్ సెంటర్లు
- మెడికల్ కౌన్సిల్ ఆకస్మిక తనిఖీల్లో బహిర్గతమైనా చర్యలు శూన్యం
- తాజాగా ఏసీబీకి చిక్కిన డీఎస్పీ, సీఐ

సూర్యాపేట, మే 12 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలో ఇటీవల అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. సామాన్య జనం, వివిధ వర్గాల వారు ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఉన్నతాధికారులను నుంచి సిబ్బంది వరకు అంతా ఇందులో భాగస్వామ్యమైనట్లు తెలుస్తున్నది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి అక్రమాలు బయటపడిన ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఇందులో తమకు వాటా కావాలని పోలీసులు వచ్చారంటే ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

తిలాపాపం తలా కొంచెం అన్నట్లు..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అవినీతి జబ్బు పట్టగా ఆ అవినీతి పాపపు సొమ్మును తిలా పాపం తలా కొంచెం అన్న చందంగా భాగస్వాములైనట్లు తెలుస్తుంది. దీంతో అర్హత లేని డాక్టర్లు రోగులకు వైద్యం అందిస్తున్నట్లు, అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్లు నడుపుతున్నట్లు ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ విచారణలో వెలుగులోకి వచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక జిల్లా వైద్యశాఖకు చెందిన ఓ అధికారి మధ్యవర్తిత్వం వహించి నిర్వాహకుల నుంచి లక్షల్లో డబ్బులు ఇప్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో తమకు వాటా రావడం లేదేందని పోలీసులు కేసు నమోదు చేసి రూ.25 లక్షలు డిమాండ్ చేస్తే స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడితో రూ.16 లక్షలకు ఒప్పందం కుదుర్చుకోవడం, డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు ఏసీబీని ఆశ్రయిస్తే సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు అరెస్టు అయ్యారు. దీనిని బట్టి గత మూడు నాలుగేండ్లుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అవినీతి ఏ స్థాయిలో రాజ్యమేలుతుందో అర్థమవుతున్నది. అవినీతి కోటను పెకిలించే వారే లేకుండా పోయారు. గత మూడు నాలుగేండ్ల కాలంలో జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు చివరకు ఆర్ఎంపీలను కూడా వదలకుండా పీడించి డబ్బులు వసూలు చేస్తుండగా దాదాపు రూ.12 కోట్ల వరకు అక్రమ సంపాదన చేసినట్లు సొంత శాఖ వారి ద్వారానే తెలుస్తున్నది. సస్పెండైన ఉద్యోగి జీతం ఇచ్చేందుకు లంచం.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిణుల వేతనాలు మింగేయడం, అర్హత లేని డాక్టర్లు రోగులకు వైద్యం అందిస్తున్నట్లు, స్కానింగ్ సెంటర్లు నడుపుతున్న వారి నుంచి పెద్ద మొత్తంలో మామూళ్లు... గత నెలలో ఎన్‌హెచ్ఎం నుంచి రూ.30,50,000, అలాగే ఫ్లెక్సీల ప్రింటింగ్ పేరిట రూ.4,71,420 కేంద్ర నిధులు రాగా మెజారిటీ స్వాహా చేశారు. చివరకు కోవిడ్ నిధులు కూడా వదలలేదనే ఆరోపణలు తెలిసిందే. వీటన్నింటిపైనా ఇటీవల 17వ తేదీన అలాగే నేడు జిల్లా కేంద్రంలో పలు తనిఖీలు చేసి శరత్ కార్డియాక్ సెంటర్‌లో అసలు డాక్టరే లేకుండా ఒక టెక్నీషియన్ ఉండి టెస్టులు చేస్తున్నాడు. యాపిల్ స్కాన్ సెంటర్‌లో ఎంబీబీఎస్ రెన్యూవల్ లేకపోగా మరో డాక్టర్‌కు తెలంగాణ కౌన్సిల్‌లో అనుమతి లేదు. శ్రీకృష్ణ ఆసుపత్రిలో అర్హత ఉన్న డాక్టర్ లేకపోగా శ్రీకృష్ణ ఆస్పత్రిలో తెలంగాణ రిజిస్ట్రేషన్ లేదు. అల్ట్రా సౌండ్ సిస్టం ఏపీ ప్రభుత్వ వైద్యాధికారి పేరిట అనుమతలు ఉండగా ఆ వైద్యాధికారి ప్రస్తుతం ఆంధ్రాలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వీటన్నింటికి ఎలా అనుమతులు ఇచ్చారో వారికే తెలియాలి. వీటిలో జిల్లా వైద్యాధికారి ఏమైనా అక్రమాలకు పాల్పడ్డారా అని మీడియా ప్రశ్నిస్తే అనుమానించాల్సిందే కదా అని డాక్టర్ నరేశ్ చెప్పారు. నెల నెలా వస్తున్న లక్షలాది రూపాయలు పోతాయనే ఉద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ అధికారి మధ్య వర్తిత్వం వహించి శాఖాపరంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా, సీజ్ చేయకుండా ఉండేలా రూ.25 లక్షల నుంచి కోటిన్నర వరకు నిర్వాహకుల నుంచి ఇప్పటించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా భావించిన పోలీసులు సైతం తమకు డబ్బులు రావాల్సిందేనని డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్కానింగ్ సెంటర్‌పై కేసు నమోదు చేశారు. సంబంధిత శాఖనే పట్టించుకోకుండా మేనేజ్ చేసుకుంటే పోలీసులు డబ్బులు డిమాండ్ చేయడంతో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను ఆశ్రయించి ఏసీబీకి ఫిర్యాదు చేయడంతోనే డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కారని గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఇంతటి అవినీతి రాజ్యమేలుతున్నా ఆ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా పాలనా యంత్రాంగం కళ్లు మూసుకొని ఉండడం పట్ల ఆశ్చర్యం కల్గిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా మరీ విచ్చలవిడిగా మారిన అవినీతికి అడ్డుకట్ట వేసి అనుమతులు లేకుండా నడుస్తున్న ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేసి జిల్లా పరువును కాపాడాలని పలువురు కోరుతున్నారు.

నేడు టీఎస్ పాలిసెట్

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- ఉమ్మడి జిల్లాలో 29 సెంటర్లు.. 10,083 మంది విద్యార్థులు



రామగిరి, మే 12 : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ పాలిసెట్-2025కు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకు పరీక్ష జరుగనుంది. ఉమ్మడి నల్లగొండలో జిల్లాలో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 10,083 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో 11 సెంటర్లు.. 5,203 మంది.. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 7 సెంటర్లు.. 2.798, తిరుమలగిరిలో 1 సెంటర్.. 328 మంది.. భువనగిరిలో 4, యాదగిరి గుట్టలో 2 సెంటర్లు ఉండగా 1,754 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. నిర్ణీత సమయం కంటే నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదని అధికారులు తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు. పరీక్షకు హాల్ టికెట్, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, షార్ప్‌నర్, ఎరేజర్ విధిగా తెచ్చుకోవాలి. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షలకు నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్లుగా సీహెచ్ నరసింహా రావు, డి.వెంకటేశ్వర్లు, కె.సుజాత వ్యవహరించనున్నారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలు
- ప్రభుత్వ హామీతో పరీక్షల నిర్వహణకు సిద్ధం : ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు

రామగిరి, మే 12 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి డిగ్రీ పలు సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న సమ్మె విరమించడంతో ఎంజీయూ ఇప్పటికే విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నిర్వహణకు సిద్ధమైంది. దీనికి సంబంధించి ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 36 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్‌తో జూమ్ మీటింగ్ నిర్వహించారు. పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలని, ఏమైనా సమస్యలుంటే యూనివర్సిటీ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి నుంచి స్పష్టమైన హామీ రావడంతోనే విద్యార్థుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణకు ఆమోదం తెలిపామని ఎంజీయూ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, నీలగిరి విద్యా సంస్థల కరస్పాండెంట్ మారం నాగేందర్‌రెడ్డి వెల్లడించారు.

పరీక్షలు.. విద్యార్థులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లాలో 14, సూర్యాపేటలో 10, యాదాద్రిభువనగిరిలో 12 పరీక్ష కేంద్రాలున్నాయి. రెగ్యులర్, బ్యాక్‌లాగ్ విభాగంలో 2వ సెమిస్టర్‌లో 10,408, 4వ సెమిస్టర్‌లో 8,660, 6వ సెమిస్టర్‌లో 4,171 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. బ్యాక్‌లాగ్ పరీక్షలు 1వ సెమిస్టర్‌లో 6,066, 3వ సెమిస్టర్‌లో 5,109, 5వ సెమిస్టర్‌లో 4,171మంది హాజరవనున్నట్లు సీఓఈ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు వీటితో రావాలి..

- పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గతంలో తీసుకున్న హాల్ టికెట్ లేదా ప్రస్తుతం తీసుకున్న నూతన హాల్ టికెట్‌తో హాజరుకావచ్చు.
- కళాశాల ఐడీ కార్డు లేదా ఏదైనా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుతో రావాలి
- ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరు.